క్లుప్తంగా

జూలో ఏనుగులపై అవగాహన

ఆరిలోవ : అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ జూ పార్కులో మంగళవారం పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు జూ అధికారులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ, జూ వెటర్నరీ వైద్యుడు పి.భాను విద్యార్థులకు ఏనుగుల గురించి వివరించారు. జూలో ఉన్న కృష్ణ, రాజు, లక్ష్మీ, సరస్వతికి అందిస్తున్న ఆహారం, వైద్య సేవలు, వాటి అలవాట్లు, ప్రవర్తన, వాటితో మావటీలకు ఉండే అనుబంధం వివరించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్ పి.చౌదరి, సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బుల్స్‌పై రాయల్స్ విజయం

విశాఖ స్పోర్ట్స్ : ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ 3 వికెట్ల తేడాతో భీమవరం బుల్స్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బుల్స్ 4 వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో హిమకర్ (81), రేవంత్ (69) రాణించారు. ప్రతిగా రాయల్స్ మరో రెండు బంతులుండగానే ఏడు వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసి విజయాన్నందుకుంది. కెప్టెన్ హనుమవిహారి (37), పాండురంగరాజు (20), రాహుల్(52), విజయ్(36), అయ్యప్ప(26) రాణించారు.

గర్జించిన వైజాగ్ లయన్స్

మరో మ్యాచ్‌లో వైజాగ్ లయన్స్ జట్టు విజయవాడ సన్‌షైనర్స్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌షైనర్స్ 8 వికెట్లకు 185 పరుగులు చేసింది. కెప్టెన్ అశ్విన్‌హెబ్బర్(30), అభినవ్(29), తేజ(33), కెఎస్ఎన్ రాజు(53) రాణించారు. యశ్వంత్ 4 వికెట్లు, సాయితేజ రెండు వికెట్లు తీశారు. ప్రతిగా వైజాగ్ లయన్స్ వీరారెడ్డి(104) సెంచరీతోను, రికీబుయ్(58)అర్ధసెంచరీతో రాణించి విజయతీరాలకు చేర్చారు.

ఆక్యుప్రెషర్ చికిత్స పురాతనమైంది

మద్దిలపాలెం: లాల్ నాయక్ ట్రస్ట్ (విశాఖపట్నం), ఒడిశా స్వాస్థ్య సేవా సంఘ్ (కటక్) సహకారంతో 8వ ఆక్యుప్రెషర్ చికిత్స శిక్షణ శిబిరాన్ని మంగళవారం పిఠాపురంకాలనీలో ప్రారంభించారు. ముఖ్య అతిథి ఆంధ్రా మెడికల్ కాలేజీ జనరల్ మెడిసిన్ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఎ.నాయక్ ప్రారంభించారు. అనంతరం డాక్టర్ నాయక్ మాట్లాడుతూ నేటి వాతావరణంలో ప్రత్యామ్నాయ వైద్యంగా ఆక్యుప్రెషర్ ఔచిత్యాన్ని వివరించారు. ఆక్యుప్రెషర్ ఒక పురాతన వైద్య పద్ధతి అని, దీనిని చరక సంహితలో మర్మ చికిత్సగా ప్రస్తావించారన్నారు. లాల్ నాయక్ ట్రస్ట్ డైరెక్టర్ రామచంద్ర నాయక్ మాట్లాడుతూ ప్రసిద్ధ ఆక్యుప్రెషర్ ప్రాక్టీషనర్, శిక్షకుడు సౌమిత్ర దాస్, ఇతర నిపుణులతో కలిసి ఈ సెషన్లు నిర్వహిస్తామని తెలిపారు. హెచ్‌పీసీఎల్ విశ్రాంత సూపరింటెండెంట్, హెల్త్ మేనేజ్‌మెంట్ ట్రైనర్ వెంకటరావు పాల్గొన్నారు.

కళాకారులకు సరకులు పంపిణీ

మద్దిలపాలెం : విశాఖ నగరంలోని కళాకారులకు నిత్యావసర సరకులు క్రిష్టా కళాశాల రోడ్డులో గల హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో మంగళవారం అందజేశారు. రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ గౌరవ సలహాదారు కొడాలి శ్రీకాంత్, వ్యవస్థాపకులు డాక్టర్ వేమలి త్రినాథరావు నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. చర్చి రెవరెండ్ సురేష్ కుమార్ పక్కి, ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, ఎన్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అందరికీ అవగాహన అవసరం



అవగాహన పోస్టర్ ప్రదర్శిస్తున్న ఏడీఎంహెచ్‌వో రోణంకి రమేష్, తదితరులు

మద్దిలపాలెం : అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సమగ్ర ఐఈసీ క్యాంపెయిన్ – 2025 కార్యక్రమాన్ని డాక్టర్ వి.ఎస్. క్రిష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో ఆర్.రమేష్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే ఇన్ఫెక్షన్లు, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రచారం చేస్తామన్నారు. హెచ్ఐవీపై యువతకు అవగాహన అవసరమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్.సాయిక్రిష్ణ, ఎన్ఎస్ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ జి.వి. ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు, కె.రవిబాబు, ఎం.రాజేశ్వరరావు, ఎస్.వి.రామారావు పాల్గొన్నారు

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెప్పాలి

వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



కరపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, నాయకులు



భానోజీనగర్‌లో మహిళకు కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



23వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు

మద్దిలపాలెం: మోసపూరితమైన హామీలతో బురిడీ కొట్టించిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరించారు. సంబంధిత కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కరపత్రంలో ఉన్న స్కానర్ లోగోను స్కాన్ చేస్తే చంద్రబాబు మోసాలు సమగ్రంగా తెలుస్తాయని సూచించారు. వార్డు అధ్యక్షుడు బూసరమణారెడ్డి, గుడ్ల గణేష్ రెడ్డి, ఎంర్డెడ్ల ఈశ్వర్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణ రెడ్డి, పరిశీలకులు బోర కుమార్, బోయి త్రినాథ్ రెడ్డి, గుడ్ల త్రినాథ్ రెడ్డి, పులగం శ్రీనివాస్ రెడ్డి, పులగం కొండా రెడ్డి, నగిరెడ్ల పోలిశెట్టి, గుడ్ల నర్సింగరావు రెడ్డి, కేవీ రమణ, ఏరుసు అరుణ, బోర సూరమ్మ, బోయి రమణ రెడ్డి, గుదే శ్రీనివాసరావు, బోర రాము రెడ్డి, కారపు రెడ్డి దుర్గా శ్రీనివాస్, పిట్టా జగదీష్ రెడ్డి, పిలక మధుసూదన్ రెడ్డి, పినింట్ల నరసింగరావు రెడ్డి, పుట్ట రమణమ్మ, చిల్లా ఎల్లయ్యరెడ్డి, సాల చిన్ని, అచ్చి సుధీర్ రెడ్డి, చిల్లా నారాయణరావు, కొనిస సూర్యనారాయణ, మహమ్మద్ ఆలీ, ఒమ్మి శ్రీనివాస్ పాల్గొన్నారు.

• జీవీఎంసీ 22వ వార్డులోని 234వ సంబరు బూత్ పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను పొందుపరచిన కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ కూదా భాష, నిజాముద్దీన్, మహిళా ప్రెసిడెంట్ వంకర శశికళ, పీతల మహేష్, అప్పలనాయుడు, నిట్ట వెంకట్రావు, చంద్రరావు, అన్నపూర్ణ పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు భానోజీనగర్ 195, 196 నంబర్ బూత్‌ల పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు గడపగడపకు వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. గత ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు, అరాచకాలు వివరించారు. కార్యక్రమంలో రాపాక శ్రీను, సంపంగి సురేష్, మామిడిపాక మహేష్, కోన కామేష్, చట్టి చిన్న, సోమదుల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ రహితంగా ఏయూను నిలపాలి



ర్యాగింగ్ నిషేధంపై అవగాహన ర్యాలీలో విద్యార్థులు

మద్దిలపాలెం : యువత ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ సూచించారు. ఏయూ పరిపాలన భవనం నుంచి ఇంజినీరింగ్ కళాశాల వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే తీవ్ర పరిణామాలు, శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. యువత సామరస్యంగా మెలగాలని సూచించారు. ఎవరూ ర్యాగింగ్‌కు పాల్పడి ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, పూర్తి సమయాన్ని జ్ఞానాన్ని పొందడానికి కేటాయించాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దడంలో యువత పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం, ఆచార్య జి.గిరిజ శంకర్, ఆచార్య ఎస్.హరినాథ్, ఆచార్య ఎ.మరీ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాకారం

మద్దిలపాలెం : సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాకారం చేసే దిశగా యువత కృషి చేయాలని యునైటెడ్ నేషన్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఫర్ ఇండియా – భూటాన్ డైరెక్టర్ డారిన్ ఫారెంట్ అన్నారు. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏయూ ఎకనామిక్స్ విభాగంలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ ఫెయిత్ డైలాగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఏయూ ఎకనామిక్స్ విభాగం, ఆగ్రో ఎకనామిక్స్ రీసెర్చ్ సెంటర్, ఎస్ వుయ్ కెన్ సంస్థ, కింగ్స్ కాలేజ్ పూర్వ విద్యార్థుల సంఘం హైదరాబాద్ శాఖ, వుయ్ ద పీపుల్ ఇండియా ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఫారెంట్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడంలో అందరికీ బాధ్యత ఉందన్నారు. సమాజంలో మనుషులంతా సమానంగా జీవించాలని, ఆహారం లేకుండా ఎవరూ చనిపోకూడదన్నారు. అభివృద్ధి లక్ష్యాలను ప్రపంచానికి, ప్రజలకు తెలియజేయడానికి సామాజిక మాధ్యమాలను, ఏఐ సాంకేతికతను వినియోగించాలని కోరారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యం దిశగా యువత ఆలోచించడం, పనిచేయడం ఎంతో అవసరమన్నారు. వైవిధ్యమైన సంస్కృతులను పరస్పరం అందిపుచ్చుకోవడం, గౌరవించుకోవడం ఎంతో అవసరమని సూచించారు. కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ రీజినల్ డైరెక్టర్ నల్లి జ్యోతి కుమార్ మాట్లాడుతూ విశ్వాసాన్ని కలిగి ఉండడం ఎంతో ప్రధానమని చెప్పారు. ఎకనామిక్స్ విభాగ అధిపతి డాక్టర్ లిల్లీ గ్రేస్ యూనిస్, సదస్సు కన్వీనర్ స్టీఫెన్ అనురాగ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల తెలుగు పోస్టర్‌ను అతిథులు విడుదల చేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డారిన్ ఫారెంట్, తదితరులు

ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం పోరాడుతాం



ఏఐఎస్ఎఫ్ పతాకం ఆవిష్కరిస్తున్న విద్యార్థి సమాఖ్య నాయకులు

మద్దిలపాలెం: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం ఆంధ్ర విశ్వవిద్యాలయం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సీఎస్.క్షేత్రపాల్ రెడ్డి హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఆగస్టు 12, 1936న బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించిందని గుర్తు చేశారు. విద్యార్థుల హక్కులు కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం పోరు సాగించాలని కోరారు. విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలకు అనుమతి లేదని తీసుకొచ్చిన జీవోలు ఎవరి కోసమని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం గతంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. షరతులు కారణంగా తల్లికి వందనం పథకం చాలా మందికి అందలేదన్నారు. జీవో నంబర్ 77, 107, 108 రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేఖర్, యూనివర్సిటీ కార్యదర్శి జె.అభిషేక్, హేమానంద్, మౌనిక, భవాని, గ్రేస్ ప్రకాష్, శివరాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రారంభంలోనే గుర్తిస్తే మేలు



టోల్ ఫ్రీ నంబరు చార్టు ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఆరిలోవ: క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించగలిగితే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని అపోలో అంకాలజీ వైద్యులు డాక్టర్ ఆదిత్య నారాయణ, డాక్టర్ ప్రకాష్‌రెడ్డి సూచించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు, చికిత్స పొందుతున్న వారు, మందులు వాడుతున్న వారి కోసం హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రిలో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబరు (1800 203 1066) మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ నంబర్‌ను అపోలో సీవోవో డాక్టర్ కృష్ణప్రసాద్ అంకాలజీ వైద్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వైద్యులు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే అంకాలజీ రోగుల కోసం టోల్‌ఫ్రీ నంబరు మొదటిసారి ఏర్పాటు చేశామన్నారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారు ప్రారంభంలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. టోల్‌ఫ్రీ నంబరు ద్వారా వైద్యులకు ఫోన్ చేసి రోగి వివరాలు తెలియజేస్తే అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తారన్నారు. అంకాలజీ వైద్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ చంద్రకళ్యాణ్, డాక్టర్ నిరంజన్, డాక్టర్ ధీరజ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ కక్ష సాధింపు చర్యలు ఆపాలి



పిఠాపురం కాలనీలో నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

మద్దిలపాలెం: వీధి విక్రయదారుల రక్షణకు 2014లో కేంద్ర ప్రభుత్వం స్ట్రీట్ వెండర్స్ చట్టం తీసుకొచ్చినప్పటికీ నగరంలోని తోపుడు బండ్ల కార్మికులను జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కక్షపూరితంగా వేధిస్తున్నారని కళాభారతి తోపుడుబండ్ల చిరు వ్యాపారుల సంఘం నాయకుడు బన్నీ మండిపడ్డారు. కోర్టు తీర్పు ఉన్నప్పటికీ స్థానిక కార్పొరేటర్ కక్ష సాధింపుపై మంగళవారం పిఠాపురం కాలనీ కళాభారతి పార్కు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుకు మేలు చేస్తాడని పీతల మూర్తి యాదవ్‌కు ఓట్లు వేసి గెలిపిస్తే ధ్వంసం చేస్తున్నాడని ఆరోపించారు. రోడ్డు పక్కన చిరు వ్యాపారులు ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారని, ఈ విషయంపై కోర్టులో మూర్తి ఫిర్యాదు చేస్తే స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ తమ వ్యాపారాలు సాగకుండా జీవీఎంసీ అధికారులను బెదిరించి ఫుట్‌పాత్ నిర్మిస్తున్నారని మండిపడ్డారు. పేదల జీవితాలతో ఆడుకుంటున్న మూర్తిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. స్థానిక వ్యాపారులు, చిల్లర వర్తకులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో యువతరం భాగమవ్వాలి

మద్దిలపాలెం : యువతరం దేశ అభివృద్ధిలో భాగం కావాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ పరిపాలన విభాగం వద్ద మంగళవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశభక్తితో వికసిత్ భారత్ లక్ష్యాలను సాకారం చేసే దిశగా సాగాలన్నారు. నూతన ఆవిష్కరణలతో సాంకేతిక, ఆర్థిక రంగాల్లో దేశాన్ని ప్రపంచంలో అత్యున్నత స్థానంలో నిలపడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజ శంకర్, ఆచార్య కె.సీతామాణిక్యం పాల్గొన్నారు.

● ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ ఇంజినీరింగ్ కాలేజీలో హర్ ఘర్ తిరంగ ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు - మద్దిలపాలెం

అవయవదానంపై సమాజంలో అవగాహన పెరగాలి



డాక్టర్ రవిశంకర్

ఎంవీపీ కాలనీ:శరీర అవయవాల దానంపై సమాజంలో మరింత అవగాహన పెరగాలని మెడికవర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరోలాజిస్ట్ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ రవిశంకర్ అన్నారు. మంగళవారం ఆర్గాన్ డోనేషన్ డేని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీలోని మెడికవర్ హాస్పిటల్‌లో వెబినార్ నిర్వహించారు. ఈ వెబినార్‌లో మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన పలు యూనిట్ల వైద్యులు, వైద్య నిపుణులు, ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్లు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ దేశంలో ఏటా 2 లక్షల మందికి పైగా రోగులు అవయవదానం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అయితే వీరిలో అతితక్కువ మందికి మాత్రమే కావాల్సిన అవయవాలు దానంగా లభిస్తున్నాయన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో మనిషి భౌతిక అవసరాలకు అనుగుణంగా అనేక కృత్రిమ అవయవాలను తయారు చేసి అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. అయితే మనిషి ప్రాణాలను కాపాడే, జీవనానికి అత్యంత అవసరమైన చాలా అవయవాలు కృత్రిమంగా లభించే పరిస్థితి లేదన్నారు. ఈ నేపథ్యంలో అవయవదానంపై సమాజంలో పెద్ద ఎత్తున చైతన్యం తీసుకురావాల్సిన అవసరముందన్నారు. ఈ దిశగా వైద్యులు, వైద నిపుణులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. డాక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతలో స్వాతంత్య్ర స్ఫూర్తి రగిలించాలి

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్



బీచ్‌రోడ్డులో జాతీయ పతాకంతో బైక్ ర్యాలీ

ఏయూక్యాంపస్: భావితరాల్లో స్వాతంత్య్ర స్ఫూర్తిని పెంపొందించాలని, దేశ రుణం తీర్చుకునే దిశగా కృషి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. మంగళవారం ఉదయం బీచ్‌రోడ్డులో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశం కోసం నిరంతరం శ్రమించిన మహనీయుల బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. ఆర్.కె. బీచ్ నుంచి వైఎంసీఏ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో పలు విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. భారత్ మాతాకీ జై అంటూ నినదిస్తూ, మువ్వన్నెల పతాకంతో ర్యాలీలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో భాగంగా యూసీడీ, ఐసీడీఎస్, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హర్‌ఘర్ వస్తు ప్రదర్శనను తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ పతాకాన్ని తయారు చేసిన తెలుగు వ్యక్తి పింగళి వెంకయ్య వంటి మహనీయుల బాటలో పయనించాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా సీఆర్‌పీఎఫ్, ఐటీబీటీ బెటాలియన్ సిబ్బంది వాహనాలపై త్రివర్ణ పతాకాలను పట్టుకుని, భారత్ మాతాకీ జై అంటూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గిరిజన సంక్షేమ వసతిగృహం విద్యార్థుల థింసా నృత్యం, గాజువాక విద్యార్థుల భరతనాట్యం, దేశ భక్తి గీతాలకు ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి. కె.రామారావు, బెటాలియన్ కమాండెంట్ భగత్‌సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై ఇంటింటా ప్రచారం



17వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు



19వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న సూరాడ దాసు, నాయకులు

ఎంవీపీ కాలనీ: ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసాలను ముద్రించిన కరపత్రాలు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి అందించారు. జీవీఎంసీ 17వ వార్డులో 140వ నంబరు బూత్ పరిధిలో మంగళవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కేందుకే మోసపూరిత హామీలు ఇచ్చారని దుయ్యబటాటరు. మహిళలపై జరిగే అఘాయిత్యాలను అడ్డుకుంటూ జగన్ ప్రభుత్వం దిశ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారని... ప్రస్తుతం రాష్ట్రంలోని మహిళలపై దాడులు, అకృత్యాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మహిళపై నేరాల్లో దేశంలో 2వ స్థానంలో రాష్ట్రం నిలవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి నాయకులను నిలదీయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు నీలా రెడ్డి, మహిళ విభాగం అధ్యక్షురాలు, బూత్ కన్వీనర్ పిల్లా సత్యవతి, జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి సండూరి సుబ్రహ్మణ్యం, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షురాలు పీలా జోషిల, వార్డు పరిశీలకుడు నారాయణ రావు, యూత్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు కొండబాబు, ప్రచార కమిటీ అధ్యక్షుడు సాడి దానేస్, భాస్కర్ మోహన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

• జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేటలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు సూరాడ దాసు తదితరులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రభుత్వం గత 14 నెలలుగా చేసిన మోసాలను వివరించారు. వార్డు మహిళ విభాగం అధ్యక్షురాలు బహర వసంత, యూత్ అధ్యక్షుడు గణేష్, వలంటీర్స్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

బీచ్‌రోడ్: విశాఖ డెయిరీలో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులు 305 మందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఈ పోరాటం ఆగదని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్వీ కుమార్ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10 గంటల నుండి మంగళవారం ఉదయం 10 గంటల వరకు నిర్వహించిన దీక్షలో ఆయన పాల్గొన్నారు. కార్మికుల ఓట్లతో గెలిచిన స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ కార్మికులను పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్ కుమార్ ఎటువంటి నోటీసు ఇవ్వకుండా కార్మికులను తొలగించడం శోచనీయమన్నారు. విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. సీపీఎం పార్టీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ డెయిరీ యాజమాన్యం మెడలు వంచి కార్మికులంతా విధులకు వెళ్తారని, వారికి తాను అండగా ఉంటానని తెలిపారు. దీక్షలో పాల్గొన్న కార్మికులకు నిమ్మ రసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ కుమార మంగళం, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బన్న, జిల్లా ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బారావు, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకుడు గుర్రం రమణ, మున్సిపల్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు పి.వెంకట్ రెడ్డి, బీహెచ్ఈఎల్ అధ్యక్షుడు జి.టి. ప్రకాష్, విజయ్‌కుమార్, జగన్నాథం పాల్గొన్నారు.